కాంగ్రెస్‌ను నమ్మి మళ్లీ మోసపోవద్దు


సీతారాంపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి


ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

పెద్దశంకరంపేట: గొట్టిముక్కులలో ఎంపీపీ జంగం శ్రీనివాస్

- దేవుడి పేరుతో రాజకీయం చేస్తున్న బీజేపీ
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, మే 3: హామీలు విస్మరించిన కాంగ్రెస్‌కు ఓటేసి మళ్లీ మోసపోవద్దని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల్లో ఐదు గ్యారెంటీలను అమలుచేశామని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారని, ఐదు ఎక్కడ అమలుచేశారని ప్రశ్నించారు. హామీలు నెరవేర్చని వారు ఈ ఎన్నికల్లో ఇస్తున్న హామీలను ఎలా అమలుచేస్తారని ఎద్దేవా చేశారు. దేవుడి పేరు చెప్పుకొని బీజేపీ రాజకీయం చేస్తున్నదన్నారు. బీజేపీ వచ్చాకనే శ్రీరాముడిని కొలిచామా, అంతకు ముందు దేవుడి గుళ్లకు మనం వెళ్లలేదా అని ప్రశ్నించారు. హామీల పేరుతో, దేవుళ్ల పేరుతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఓట్లు అడుగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ మాత్రం అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని అడుగుతున్నదన్నారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణకు న్యాయం జరుగుతుందన్నారు. సీతారాంపూర్ గ్రామంలో డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టుకోడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసిందని గుర్తుచేశారు. సేవా కార్యక్రమాలు చేస్తానని ముందుకొచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు సింగాయిపల్లి గోపి, సత్యంగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ శివకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ వెంకట నర్సింగరావు, నాయకులు సత్యంగౌడ్, తొంట వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జితేందర్‌రెడ్డి, సేనాధిపతి, రవి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు సుమారు 50 మంది ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకతతో బీఆర్ఎస్‌లోకి వలసలు వస్తున్నారన్నారు. కార్యకర్తలు కష్టపడి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని కోరారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన చంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నీరుడి కిరణ్, బాలేశ్, వీరన్న, ఉప్పల శేఖర్, ఎర్రమల్లేశ్, ఆవుల సుధాకర్, శ్రీనివాస్, బోయిని రాములు, చాకలి కిష్టయ్య, బాశయ్య, భిక్షపతి, ఆది బాగులు, మన్నె నరేశ్‌తోపాటు సుమారు 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగాయిపల్లి గోపి, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట: ఉపాధిహామీ కూలీలు పని చేసే ప్రదేశంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేగుంట మండలం కరీంనగర్ గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా సాసైటీ వైస్ చైర్మన్ తానీషా ఇంటింటా ప్రచారం


నర్సాపూర్‌లో దుకాణదారుడికి కారు గుర్తుకు ఓటేయ్యాలని కోరుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

తూప్రాన్: మాట్లాడుతున్న ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంట్టాల యాదగిరి ముదిరాజ్

మెదక్ రూరల్: మాక్తాభూపతిపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి

మెదక్‌రూరల్: ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి

చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏకే గంగాధర్‌రావు

అల్లాదుర్గం మండలంలోని చిల్వెర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు


మనోహరాబాద్ మండలం కూచారంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శేఖర్‌గౌడ్.

తండాలను అభివృద్ధి చేసింది కేసీఆరే..


హవేళీఘనపూర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

- ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్‌రూరల్, మే3: గిరిజనులు తమను తాము పాలించుకునేలా స్వయం పరిపాలనాధికారం కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హవేళీఘనపూర్ మండలంలోని గిరిజన తండాలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కేసీఆర్ గిరిజన తండాలను పంచాయతీలుగా మార్చారన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుని గిరిజన ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో ఎంపీపీ శేరినారాయణరెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మాణిక్యరెడ్డి, ఎన్నికల సమన్వయకర్త బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

బాధ్యతలు స్వీకరించిన నాగరాజ్‌గౌడ్

మెదక్ మున్సిపాలిటీ, మే 3: జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమాభివృద్ధి అధికారిగా నాగరాజ్‌గౌడ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అంతకుముందున్న అధికారి శంకర్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ మేరకు కార్యాలయ సిబ్బందితో కలిసి కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, రమేశ్‌కు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇంట్లోనే ఓటేసిన దివ్యాంగులు

సుతారిపల్లిలో ఇంట్లోనే ఓటేస్తున్న దివ్యాంగుడు భూదయ్య

రామాయంపేట, మే 3: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధులు, దివ్యాంగులు తమ ఇంట్లోనే ఓటేసేలా నిబంధన విధించింది. శుక్రవారం ఎన్నికల నిబంధనల ప్రకారం రామాయంపేట ఎన్నికల బూత్ లెవల్ మండల స్థాయి అధికారులు మండలంలోని వృద్ధులు, దివ్యాంగులతో వారి ఇంటికే వెళ్లి ఓటేయిస్తున్నారు. మండలంలోని సుతారిపల్లి, ఆర్.వెంకటాపూర్, డీ.ధర్మారం, కోనాపూర్, కాట్రియాల తదితర గ్రామాల్లో కార్యదర్శులు దగ్గరుండి ఓట్లేయించారు.

ఆర్.వెంకటాపూర్‌లో ఓటేస్తున్న దివ్యాంగుడు

సీహెచ్‌సీలో ఆన్‌లైన్ సేవలు

సీహెచ్‌సీలో ఆన్‌లైన్ సేవలను ప్రారంభిస్తున్న డాక్టర్ లింబాద్రి

రామాయంపేట, మే 3: రామాయంపేట ప్రభుత్వ దవాఖానలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి పేర్కొన్నారు. శుక్రవారం దవాఖానలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించారు. కమ్యూనిటీ దవాఖానలో క్యూఆర్ కోడ్ స్కాన్ అమలు చేశామని, రోగులు తమ అపాయిట్మెంట్ కోసం వేచి చూడకుండా ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు సుకేశిని, ప్రదీప్ పాల్గొన్నారు.

అల్లాదుర్గం, సంగుపేటలో
పరిశ్రమల ఏర్పాటుకు కృషి

గెలిచిన నాలుగు నెలల్లోనే రూ.500 కోట్ల నిధులతో అభివృద్ధి: మంత్రి దామోదర రాజనర్సింహ

అల్లాదుర్గం, మే 3: నియోజకవర్గంలోని అల్లాదుర్గం, సంగుపేటలో పరిశ్రమల ఏర్పాటు కృషి చేస్తున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ అన్నారు. శుక్రవారం మండంలోని ముస్లాపూర్ ఫంక్షన్ హాల్‌లో అల్లాదుర్గం, టేక్మాల్ మండలాల కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం, సంగుపేటలో పరిశ్రమలను నెలకోల్పేందుకు అవసరమైన భూమిని సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే నియోజకవర్గానికి రూ.500 కోట్ల నిధులు మంజూరు చేయించానన్నారు. రూ.190 కోట్లతో సింగూరు కాల్వల మరమ్మతులు, వట్‌పల్లిలో రూ.12కోట్లతో దవాఖాన, రూ.25 కోట్లతో తండాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. 6 గ్యారెంట్యీలలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు.

భారత రాజ్యాంగం జోలికొస్తే ఖబడ్దార్

చిలిపిచెడ్, మే 3: బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మారుస్తామనడం సమంజసం కాదని, రాజ్యాంగం జోలికొస్తే ఖబడ్దార్ అని మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ అన్నారు. శుక్రవారం చిలిపిచెడ్‌లో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అనేది ఏ ఒక్కరి సొత్తు కాదని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాలకు హక్కులు కల్పిస్తూ, దేశ సంపదను ఎలా సృష్టించుకోవాలనే అంశాలతో కూడుకున్నదని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు మండలాధ్యక్షుడు బాల్‌రాజ్, సత్యం, సుభాష్, కృష్ణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపూర్ అడవిలో చిరుత సంచారం

- సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న ఫారెస్టు అధికారులు

ఇబ్రహీంపూర్ అడవిలో ఏర్పాటు చేసిన నీటి గుంతల వద్ద సీసీ కెమెరాలో చిక్కిన చిరుత

చేగుంట, మే 3: ఇబ్రహీంపూర్ అడవిలో అటవీ శాఖ ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలో చిరుత సంచరిస్తున్న దృశ్యాలు స్పష్టంగా రికార్డయ్యాయి. దీంతో చుట్టుపక్కల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపూర్ డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ నాగరాణి తెలిపారు. ఆమె తెలిపిన వివరాలు.. ఇబ్రహీంపూర్ పరిసర ప్రాంతాల్లోని ఆటవీలో కొన్ని రోజులుగా చిరుత సంచరిస్తున్నట్లు సమాచారం. వేసవి కాలంలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అడవుల్లో ఫీట్‌సాసర్లు ఏర్పాటు చేసి తాగు నీటి సౌకర్యం కల్పిస్తారు. ఈ సాసర్ల వద్ద వారం రోజుల క్రితం ఆడవిలో కొన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి దాహార్తిని తీర్చుకునేందుకు చిరుత, అడవి దుప్పితోపాటు ఇతర వన్యప్రాణులు వచ్చి దాహార్తిని తీర్చుకున్నట్లు సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. దీంతో అడవిలో చిరుత సంచరిస్తున్నట్లు గుర్తించారు. అటవీ జంతువులు ఫారెస్టుకు ఆనుకుని ఉన్న పొలల వద్ద నీళ్లు తాగేందుకు వస్తుంటాయి. బోరు బావుల వద్ద కట్టేసిన పశువులపై దాడి చేసి చంపుతుంటాయి. కావున ఇబ్రహీంపూర్ బోనాల గోవిందాపూర్, కిష్టాపూర్, పులిమామిడి, చిట్టోజిపల్లి, రుక్మాపూర్, కరీంనగర్, రాంపూర్ గ్రామస్తులు ఫారెస్టులోకి వెళ్లవద్దని హెచ్చరించారు.

ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తాం

ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

- మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

రామాయంపేట, మే 3: సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. శుక్రవారం రామాయంపేటలో కాంగ్రెస్‌లో బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన సుమారు 300 మంది కార్యకర్తలకు ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ఐదు గ్యారెంటీలు అమలు చేశామన్నారు. ఒక్క గ్యారెంటీని కూడా పక్కాగా ఆగస్టు 15న అమలు చేసి తీరుతామన్నారు. జిల్లాలో గంజాయి లేకుండా చేస్తామన్నారు. మెదక్ జిల్లా కేంద్రాన్ని విద్యుత్ వెలుగులతో జిగేల్‌మనేటట్లు లైటింగ్ వేస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు, కౌన్సిలర్లు దేమే యాదగిరి, చిలుక గంగాధర్, దేవుని రాజు, జయ, సుందర్‌సింగ్, మాజీ సర్పంచ్ పల్లె రాంచందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏసుగారి రమేశ్‌రెడ్డి, వెంకటి, బైరం కుమార్, ముత్యంరెడ్డి, అశ్విని, నర్సింహ్మారెడ్డి, ఎంపీటీసీ నాగులు, బాలమణి పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ-పెద్దిరాజుల కల్యాణం

మండలంలోని రాయిలాపూర్ గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో పెద్దమ్మ, పెద్దిరాజు కల్యాణం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కల్యాణం తిలకించేందుకు ఎమ్మెల్యే రోహిత్‌రావు ఆలయానికి చేరుకుని చేరుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు.

పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల సరళి పరిశీలన

పోస్టల్ బ్యాలెట్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు

మెదక్, మే 3 (నమస్తే తెలంగాణ): కలెక్టరేట్, ఆర్డీవో మెదక్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ల సరళిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ సరళిలో ఎలాంటి పొరపాట్లు చేయవద్దన్నారు. ప్రతి ఓటరుకు గుర్తింపు కార్డు ఉండాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ గురించి రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ముందే సమాచారం ఇచ్చామన్నారు. ఇతర నియోజకవర్గాల నుంచి మెదక్ జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారు కలెక్టరేట్, ఆర్డీవో కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.

ఈవీఎంల రెండో ర్యాండమైజేషన్

ఎన్నికల సాధారణ పరిశీలకుడు సమీర్ మాధవ్ కుర్కోటి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రెండో ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను శుక్రవారం పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో మెదక్ ఎంపీ స్థానానికి 44 మంది పోటీలో ఉన్నందున (01) నోటా ఎన్నికల సంఘం కేటాయించిందన్నారు. అదనపు ఈవీఎంలకు నియోజక వర్గాల వారీగా మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, సంగారెడ్డి, దుబ్బాక, పటాన్‌చెరు, గజ్వేల్‌లోని పోలింగ్ కేంద్రాలకు ర్యాండమైజేషన్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మెజార్టీతో నీలం మధును గెలిపించండి

నర్సాపూర్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

నర్సాపూర్, మే 3: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును నర్సాపూర్ నియోజకవర్గం నుంచి 20 వేల మెజార్టీ ఇవ్వాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా నాయకులు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ మొదటి, బీఆర్ఎస్ రెండో, బీజేపీ మూడో స్థానంలో ఉంటాయన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంట్ అందించిందన్నారు. ఆగస్టు 15 లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ర్యాలీలో ఏఐసీసీ మెదక్ ఎంపీ ఎలక్షన్ అబ్జర్వర్ సురేశ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లేశం, ఎంపీపీ జ్యోతీసురేశ్‌నాయక్, నాయకులు సుహాసినిరెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, అశోక్‌గౌడ్, గుర్రాల అశోక్ పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పెంపు

మెదక్ మున్సిపాలిటీ, మే 3: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు శనివారం వరకు పొడిగించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం గురువారంతో గడువు ముగియగా, మరోసారి పెంచినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త మృతి

రామాయంపేట, మే 3: బీఆర్ఎస్ కార్యకర్త హఠాన్మరణం చెందిన ఘటన మండలంలోని అక్కన్నపేట గ్రామంలో శుక్రవారం జరిగింది. కుటుంబీకులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. నమూండ్ల లక్ష్మీనారాయణ(45)కు చాతిలో నొప్పి రావడంతో కింద పడిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు వెంటనే రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ఆయన పార్టీలోనే కొనసాగుతున్నాడని నాయకుడు నరేందర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

బాలికపై లైంగిక దాడి

రామాయంపేట, మే 3: మైనర్ బాలికపై ఇద్దరు వ్యక్తులు లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తూప్రాన్ డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేటలోని బీసీ కాలనీలో నివసిస్తున్న బాలికకు మాయమాటలు చెప్పి మార్చి 29న లైంగిక దాడికి పాల్పడ్డారు. బాధితురాలు భయంతో పోలీసులు గాని, ఇంట్లోగాని చెప్పలేదు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టగా ఇద్దరు వ్యక్తులు కలిసి బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు వెలుగుచూసింది. ఇద్దరు నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

వెంటనే జీపీఎఫ్ బిల్లులు జమ చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, మే 3: ఈ కుబేర్‌లో పెండింగ్‌లోని ఉపాధ్యాయుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ రుణాలు, పాక్షిక ఉపసంహరాణ బిల్లులు వెంటనే విడుదల చేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయుడు వ్యక్తిగతంగా రూ.10 వేల నుంచి రూ.80 వేల వరకు వడ్డీ నష్టపోయారని పేర్కొన్నారు. ఈ వడ్డీని వ్యక్తి గత ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వెల్దుర్తి, మే 3: అనుమతులు లేకుండా హల్దీవాగులోంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై నవత తెలిపారు. మండలంలోని ఉప్పులింగాపూర్ గ్రామ శివారు హల్దీవాగులోంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో శుక్రవారం తెల్లవారుజామున సిబ్బంది వెళ్లగా చిన్నశంకరంపేట మండలం ధరిపల్లి గ్రామానికి చెందిన మూడు ట్రాక్టర్లు ఇసుక లోడ్‌తో ఉండగా వాటిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిప్పంటించుకుని వ్యక్తి మృతి

సురేశ్ (ఫైల్)

శివ్వంపేట, మే 3: డీజిల్ పోసుకుని, నిప్పంటించుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దొంతి గ్రామానికి చెందిన ఉప్పగల సురేశ్ (30) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. గత కొంతకాలంగా అప్పుల బాధ, అతని మీద మర్డర్ కేసు ఉన్నందున కోర్టు పేషీలకు తిరగడంతో మనస్తాపానికి గురై గురువారం వ్యవసాయ పొలం వద్ద డీజిల్ పోసుకుని నిప్పు పెట్టుకున్నాడు. మృతుడి తల్లి ఉప్పగల నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LAND FOR SALE

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్డు, SBI దగ్గర, 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. సంప్ర: 8143366630, 9989554915.
NT-5274

LOST

★I, SYED ASAD MOHIUDDIN SYED ASAD, S/o. SYED GHOUSE, R/o: 8-27, Ramayanpet (V) & (M), Medak District, T.S., lost my Agriculture land Patta Pass Book No. T08130140004 in Khata No.5, lost from Ramayampet Bus Stand. if anyone found please cont: 8897251213
NT-334255

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.